క్లుప్తంగా

ప్లేడేలు పెంచండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఏరియా వర్క్‌షాపులో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్లేడేలు పెంచాలని, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఏరియా జీఎం శాలేంరాజును కోరారు. గురువారం జీఎం చాంబర్‌లో ఆయనను కలిసి మాట్లాడుతూ.. ఏరియాలోని జయశంకర్ గ్రౌండ్‌లో ఉన్న వజ్రాలగుట్టపై గ్రౌండ్‌కు వచ్చే అథ్లెటిక్స్ వజ్రాల గుట్ట ఎక్కడానికి ఇబ్బందిగా ఉంటున్న నేపథ్యంలో పోల్స్, గ్రాడింగ్ రోప్స్ వేయించాలని కోరారు. సత్తుపల్లిలోని క్వార్టర్స్‌లో సమస్యలను పరిష్కరించాలని, వీకే-7 గని అనుమతులు త్వరగా వచ్చేవిధంగా చూడాలని కోరారు. స్పందించిన జీఎం ఒకసారి విజిట్ చేసి పరిశీలిస్తామన్నారు.

క్రీడల్లో రాణించాలి

కొత్తగూడెంటౌన్: ఈనెల 19, 20 తేదీల్లో భువనగిరిలో జరిగిన పోటీల్లో తెలంగాణ రాష్ట్ర నాలుగో జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో పోటీల్లో కొత్తగూడెం జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలను సాధించారు. ఈ మేరకు వారు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇనిగల మొగిలితో కలిసి డీఎస్పీ గురువారం కలిశారు. మాట్లాడుతూ.. విద్యార్థులు దేశం గర్వించదగిన పౌరులుగా తయారు కావాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు నిట్ట ప్రవీణ్‌కుమార్, అవినాస్, జయదీప్, చరణ్, డానియేల్, గౌతమ్, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇనిగల మొగిలి, జిల్లా తైక్వాండో అధ్యక్షుడు నిట్టా ప్రసాద్, రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ పి.కాశీ హుస్సేన్ ఉన్నారు.

ముదిరాజ్ సేవాసమితి అధ్యక్షుడిగా వీరయ్య



పాల్వంచరూరల్: పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన నాగ వీరయ్య కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి సత్యం గురువారం నియమాక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. రాజకీయలకు అతీతంగా సంఘం బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

రైతుల ఆందోళన

పాల్వంచరూరల్: సంగం గట్టు గ్రామ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ 20 రోజుల క్రితం కాలిపోయింది. దీంతో పంటపొలాలకు సాగునీరు అందక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను త్వరగా ఏర్పాటు చేస్తామని మధ్యవర్తి చెబితే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌కు రూ.3,500 చందాలు వేసుకుని ఇచ్చామని అయినా ఇంత వరకు ఏర్పాటు చేయలేదని గురువారం రైతులు పాల్వంచ పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో ఉన్న రూరల్ ఏఈ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో రైతులకు ఏఈకి వాగ్వాదం జరగడంతో ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయమంటే లైన్‌మెన్ కానీ, ఏఈ కానీ స్పందించడం లేదన్నారు. పొలాలు ఎండిపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకోవడమే శరణ్యమని ఏఈ రవీందర్‌కు చెబితే తాగి చచ్చిపోండి అన్నారని రైతులు వాపోయారు. సమస్య ఏడీఈ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఆయుష్ వైద్యశిబిరం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులను పరీక్షించి అవసరమైన వారికి ముందులు పంపిణీ చేశారు. వృద్ధాప్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మహేష్‌గౌడ్, మెడికల్ ఆఫీసర్ విజయశ్రీ, ఫార్మసిస్ట్ విజయలక్ష్మి, ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శులు మౌనిక, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దందా

నిరుపేద కుటుంబాల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అధికారుల పర్యవేక్షణ, నిఘా లేకపోవడంతో అక్రమార్కులు బియ్యాన్ని దారి మళ్లిస్తున్నారు. బియ్యం పంపిణీలో అక్రమాలు జరగకుండా నియంత్రించేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం తీసుకొచ్చినా దందా ఆగడం లేదు. అడపాదడపా పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు ఆ తర్వాత దృష్టి సారించకపోవడం అక్రమార్కులకు కలిసొస్తోంది.

- పక్కదారి పడుతున్న పేదల బియ్యం
- పట్టుబడినప్పుడే కేసులతో సరి
- తనిఖీలపై పట్టింపు లేని అధికారులు



పట్టుబడిన బియ్యంతో పోలీసులు (ఫైల్)

జూలూరుపాడు: రేషన్ బియ్యం దందాకు జూలూరుపాడు మండలం అడ్డాగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుండటంతో చాలామంది దీన్ని వ్యాపారంగా మార్చుకున్నారు. కొందరు ఇదే దందా చేస్తూ రూ.లక్షలు సంపాదించినట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యాన్ని సేకరించేందుకు గ్రామాల్లో కొందరిని నియమించుకుని కిలో రూ.8 నుంచి రూ.10కి కొనుగోలు చేస్తున్నారు. ఆపై వ్యాపారులు కిలో రూ.15 చొప్పున కొనుగోలు చేసి వాహనాల్లో జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. కొందరు డీలర్లే నేరుగా లబ్ధిదారులకు బియ్యం బదులు డబ్బులు ఇస్తున్నట్లు సమాచారం. ఇటీవల జూలూరుపాడు మండలం కాకర్లలో అర్ధరాత్రి సమయాన ఏన్కూరు మండలానికి చెందిన ఓ వ్యాపారి లారీలో బియ్యాన్ని లోడ్ చేయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే, భేతాళపాడులో ఓ వ్యాపారి ఇంట్లో నిల్వ చేసి బియ్యం పట్టుబడ్డాయి. భద్రాద్రి జిల్లాలోని సుజాతనగర్, అశ్వాపురం, ఖమ్మం జిల్లా వీఎం బంజర, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి బియ్యం ఈ ప్రాంతం మీదుగా ఏపీలోని కోళ్ల ఫారాలకు తలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరికొందరు మిల్లర్లే బియ్యం సేకరించి రీసైక్లింగ్ చేస్తున్నట్లు సమాచారం. అయితే, తరచుగా కేసులు నమోదవుతున్నా వ్యాపారులు తీరు మార్చుకోవడం లేదు. ఇందుకు అధికారుల ఉదాసీన వైఖరే కారణమని తెలుస్తుండగా.. మరికొందరు వ్యాపారులు అంగబలం, అర్థబలం చూసుకుని చెలరేగిపోతున్నట్లు తెలుస్తోంది. అంతేకాక పట్టుబడినప్పుడు కేసు నమోదైనా పెద్దగా ఇబ్బంది లేకపోవడం. రేషన్ బియ్యం దందాల్లో రూ.లక్షలు వస్తుండడంతో వ్యాపారానికి వెనుకాడడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లయీస్, రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీలు విస్తృతం చేసి రేషన్ బియ్యం దందాను అరికట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



రేషన్ బియ్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న లారీ (ఫైల్)

అక్రమంగా తరలిస్తే చర్యలు..



రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటాం. బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి ఎవరైనా రేషన్ డీలర్లు కొనుగోలు చేసినట్లు తెలిస్తే చర్యలు తప్పవు. ఈ విషయంలో నిఘా పెంచడంతో పాటు తరచుగా తనిఖీలు చేపట్టేలా మా శాఖ ఉద్యోగులకు ఆదేశాలు ఇస్తాం.

– కె.స్వాతిబిందు, తహసీల్దార్, జూలూరుపాడు

అక్రమ రవాణాపై నిఘా..



బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిఘా పెంచాం. ఇప్పటికే పలుచోట్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేశాం. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. అక్రమంగా రేషన్ బియ్యం తరలించే వ్యక్తులపై కేసులు నమోదు చేయడమే కాక వాహనాలను సీజ్ చేస్తాం.

– ఇంద్రసేనారెడ్డి, సీఐ, జూలూరుపాడు

సమస్యలు పరిష్కరించండి..

టేకులపల్లి: ఏళ్ల తరబడి టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా కోశాధికారి జే.గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. తరగతి గదుల్లో నేల కుంగి విద్యార్థులు కూర్చోవడానికి అసౌకర్యంగా ఉందని, లైట్లు, ఫ్యాన్లు లేక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. తాగునీరు, మరుగుదొడ్లు సరిపడా లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఆటస్థలం పిచ్చి మొక్కలతో నిండిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా కళాశాల సమస్యలు పరిష్కరించడం లేదని తక్షణమే సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, సాయి తేజ, సింధు, పల్లవి, చందు, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో..

పాల్వంచరూరల్: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బిల్లులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్‌చరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్వతారక కాలనీ పంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఆచన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాస్‌లు పూర్తిస్థాయిలో అందించాలని, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మరుగుదొడ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న రామ్‌చరణ్

డ్వాక్రా మహిళల ధర్నా

జూలూరుపాడు: బ్యాంకు లింకేజీ రుణాలను స్వాహా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, ఐకేపీ సిబ్బంది, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కరివారిగూడెం గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు స్థానిక సెర్ప్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ.. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను తాము ప్రతీ నెల చెల్లిస్తున్నామని, ఆ డబ్బును కరివారిగూడెం సీఎస్‌పీ నిర్వాహకుడు, గ్రామదీపిక దుర్గారావు బ్యాంకులో చెల్లించకుండా సొంతానికి వాడుకున్నట్లు ఆరోపించారు. కొత్తగా రుణం తీసుకోవాలని బ్యాంకుకు వెళ్తే అసలు విషయం బయటపడిందన్నారు. దుర్గారావు తన కుటుంబంతో పారిపోయినట్లు చెప్పారు. ఏపీజీవీబీ, సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



సెర్ప్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డ్వాక్రా మహిళలు

ఆర్థిక సాయం

పాల్వంచ: ఇటీవల పాండురంగాపురంలో గొర్రెలు కాస్తున్న అమృత్ బాబుకు రక్త పింజర పాము కాటేసింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద వ్యక్తి కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం చలువాది ట్రస్ట్ వ్యవస్థాపకులు చలవాది ప్రకాష్, రాజ్యలక్ష్మి గురువారం రూ.13,500 నగదును వితరణగా అందించారు.

పోలీసుల నాకాబందీ

ఇల్లెందురూరల్: మర్రిగూడెం గ్రామపంచాయతీ ఏడుప్పలగూడెం గ్రామంలో కొమరారం పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో గురువారం నాకాబందీ నిర్వహించారు. ప్రతీ ఇంటిని సందర్శించి పరిసరాలను తనిఖీ చేసి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ చంద్రభాను మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా రక్షణ చర్యలు పాటిస్తూ వాహనాలు నడపాలని చెప్పారు. నక్సలిజం వైపు ఆకర్షితులు కాకుండా చదువు, వ్యాపారం , వ్యవసాయంపై దృష్టి పెట్టాలని తెలిపారు.

ఆరు గ్యారంటీలు సాధిస్తాం..

టేకులపల్లి: సింగరేణి ఎన్నికల సమయంలో ఐఎన్‌టీయూసీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటి పరిష్కరిస్తూ యూనియన్ ముందుకు సాగుతోందని, ఆరు గ్యారంటీలు సాధించి ఇస్తామని యూనియన్ జనరల్ సెక్రెటరీ త్యాగరాజు, ఇల్లెందు ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు గురువారం కోయగూడెం ఓపెన్ కాస్ట్ పీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పిట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఆరు గ్యారంటీలలో ముఖ్యమైంది పెరిక్స్ మీద ఇన్‌కమ్ ట్యాక్స్ గురించి సింగరేణి యాజమాన్యంతో చర్చలు జరిగాయని, అగ్రిమెంట్ చేసుకోవడమే మిగిలిందన్నారు. 250 గజాలలో సొంత ఇంటి కల గురించి ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటితో పలుమార్లు చర్చించినట్లు చెప్పారు. కార్మికులకు మెరుగైన లాభాల వాటాను ప్రకటించే విధంగా యూనియన్ ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. పీఓ శ్రీనివాస్‌ను కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. కేఓసీలో క్యాంటీన్, కార్మికులకు ఏసీ బస్, కార్మికుల ప్లేడే, ఇతర విషయాల గురించి పీఓతో మాట్లాడారు. కేఓసీ పీఓ స్పందిస్తూ వీటిని పరిష్కరించే విధంగా జీఎం, కార్పొరేట్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం త్యాగరాజు సమక్షంలో పలువురు కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు.



కేఓసీలో అధికారులతో త్యాగరాజు

బీసీ ఉద్యమంలో న్యాయవాదులు ముందుండాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

ఇల్లెందు: అట్టడుగున ఉన్న బీసీలకు న్యాయం జరగటం లేదని బీసీ ఉద్యమంలో బీసీ న్యాయవాదులు అగ్రస్థానంలో ఉండాలని సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్ అన్నారు. గురువారం కోర్టు ఆవరణలో బీసీ ఉద్యమ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ... 70 ఏళ్ల కాలం గడిచినా బీసీలకు న్యాయం జరగటం లేదని మండల్ కమిషన్ రిపోర్టు సమర్పించినా పరిష్కారం దిశగా ఏ ప్రభుత్వం కృషి చేయటం లేదని ఆరోపించారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగే ఓబీసీ రాష్ట్ర స్థాయి న్యాయవాదుల సదస్సులో న్యాయవాదులంతా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పప్పుల గోపీనాథ్, పి.బాలకృష్ణ, జున్ను ఐలయ్య, పెద్దూరి వెంకటనర్సయ్య, మామడి సత్యప్రకాష్, కలవల సుధాకర్, ఖాసీం, యుగంధర్, బన్సీలాల్ పాల్గొన్నారు.

పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ర్యాలీ

ఇల్లెందు: ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఇల్లెందులో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు కల్తీ కోటమ్మ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర నాయకురాలు ఏనుగుల జానకి మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక రంగాల్లో స్త్రీలు పురుషులతో సమానంగా పయనించే సమాజం కావాలని కోరారు. ఇందు కోసం ఈ నెల 31న, వచ్చే నెల 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్తీ సుబద్ర, సోమ వినోద, వాంకుడోతు సరోజినీ, మంగలత, మంగ, సుభద్ర, చంద్రకళ పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆటో డ్రైవర్లు మర్యాదగా మెలగాలి



ఇల్లెందు: హాజరైన ఆటో డ్రైవర్లు, ఓనర్లు



పాల్వంచ: మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్ కుమార్

పాల్వంచ: ఆటో డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా మెలగాలని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని, మద్యం సేవించి నడపరాదని, లైసెన్స్ లిగి ఉండాలని, మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటో నడపడం చేయరాదని, సౌండ్ బాక్స్‌లు పెట్టొద్దన్నారు. స్కూల్ పిల్లలను ఎక్కించుకునేప్పుడు తగు జాగ్రత్తలతో పాటు, పరిమితికి మించి ఎక్కించుకోవద్దన్నారు. యూనిఫాం, నంబర్ ప్లేట్లు ఉండాలన్నారు. అనుమానాస్పద విషయాలు ఏం కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. సీఐ వి.వినయ్‌కుమార్, పట్టణ ఎస్ఐలు సుమన్, రాఘవయ్య పాల్గొన్నారు.

ఇల్లెందు: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రభాను అన్నారు. గురువారం ఇల్లెందు పట్టణంలోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఇల్లెందు ఆటో డ్రైవర్లలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు విధిగా వాహనంలో లైసెన్స్, ఇన్సూరెన్స్, యూనిఫాంతో ఉండాలని సూచించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని, రోడ్డు మీద ప్యాసింజర్ కోసం ఆటో నిలపాలంటే రోడ్డు పక్కకు వచ్చి నిలపాలన్నారు. సీఐ బత్తుల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎవరి వాహనాలను వారే నడపాలని సూచించారు. పట్టణంలో నిర్ణయించిన అడ్డాల్లోనే ఆటోలు నిలపాలని చెప్పారు. ఎస్ఐలు నాగుల్ మీరా పటాన్, బి.సూర్య, ఆటోల యూనియన్ నాయకురాలు మదారమ్మ, ఆటో డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ధర్నా నిర్వహించారు. మొదట మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తెలంగాణ అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 25 శాతం మాత్రమే రుణమాఫీ చేసిందని విమర్శించారు. రైతులకు ఎలాంటి ఆక్షలు విధించకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, బాదావత్‌శాంతి, భూక్యా సోన, మడిగ సరస్వతి పాల్గొన్నారు.

ఇల్లెందు: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేయాలని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగల రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ స్టేట్ కమిటీ పిలుపులో భాగంగా ఇల్లెందులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో ఉచిత వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సత్యనారాయణ, దేవీలాల్ నాయక్, ఎస్.రంగనాథ్, శీలం రమేష్, కె.రేణుక, పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రమోద్, ఘాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జూలూరుపాడు: అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు మాట్లాడుతూ.. అంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలు రుణమాఫీ చేశామని చెప్పుకుంటోందని, ఇందులో నిజం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.లక్ష రుణమాఫీ చేస్తేనే రూ.17 వేల కోట్లు అయినప్పుడు, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే రూ.18 వేల కోట్లు అవుతుందా అని ప్రశ్నించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ స్వాతి బిందుకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యురాలు భూక్యా కళావతి, చావా వెంకటరామారావు, లకావత్ హేమ్లా, భూక్యా జవహర్ లాల్, మందా రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

టేకులపల్లి: రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, రైతుబంధు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం టేకులపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. తరువాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి తహసీల్దార్ నాగభవానీకి వినతిపత్రం అందజేశారు. బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలునాయక్, బానోతు కిషన్, బర్మావత్ శివకృష్ణ, భూక్యా బాలకృష్ణ, భూక్యా లాలు, కిరణ్‌కుమార్, మూడు లాలు, ప్రసాద్, చందర్ పాల్గొన్నారు.



సూపర్‌బజార్(కొత్తగూడెం): ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఇల్లెందు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



జూలూరుపాడు: తహసీల్దార్ స్వాతి బిందుకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



టేకులపల్లిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

‘నాటుదాం ఒక చెట్టు.. అమ్మ పేరు మీద’



పాల్వంచరూరల్: తోగ్గూడెంలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో గురువారం నాటుదాం ఒక చెట్టు.. అమ్మ పేరు మీద అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు స్థానికంగా ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటించారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ కార్యక్రమాన్ని ప్రతీఒక్కరు తల్లి పేరు మీద ఇంటి వద్ద మొక్కను నాటి సంరక్షించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ, వ్యవసాయ అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: మొక్క నాటుతున్న అధికారులు, పంచాయతీ సిబ్బంది



సుజాతనగర్: మొక్కలు నాటుతున్న జెడ్పీ సీఈఓ తదితరులు



పాల్వంచ: మొక్కలు నాటుతున్న కమిషనర్ డాకూ నాయక్



టేకులపల్లి: కోయగూడెంలో మొక్క నాటుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ